క్లుప్తంగా

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలుకై రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తూ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొడపు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో సీఎంతో పాటు మంత్రుల చిత్రపటాలకు, ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ కులగణన 42 శాతంగా నిర్ధారించినందుకు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క,, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ప్రభాకర్‌గౌడ్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, గాదె కుమార్, వి బాబు, బి పాండురంగారెడ్డి, ప్రభు, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్, మహేందర్, శ్రీకాంత్, ప్రవీణ్, సల్మాన్, కిరణ్ పాల్గొన్నారు.

సర్వే చేయించడం సంతోషకరం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కందుకూరు: సీపీఎం పోరాట ఫలితంగానే ప్రభుత్వ అధికారులు ఇళ్లస్థలాలను కేటాయించడానికి సర్వే చేయడం సంతోషకరమని జిల్లా కార్యవర్గ సభ్యుడు డి రాంచందర్, మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం గతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ సందర్భంగా 788, 107లలోని ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేయించారు. అనంతరం అక్కడికి లబ్ధిదారులతో కలిసి వెళ్లి వారు మాట్లాడారు. తమ పోరాటాన్ని గుర్తించి ఆర్డీఓ, తహసీల్దార్లు స్పందించి భూములను సర్వే చేయించడం శుభపరిణామమన్నారు. త్వరగా లేఅవుట్ వేసి స్థలాలు కబ్జా చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంకగళ్ల కుమార్, బుడ్డీరపు శ్రీనివాస్, గాదె సత్యం, గుడిసెల సంఘం అధ్యక్షుడు రాయకల్ శేఖర్, లబ్ధిదారులు రాములు, అంజయ్య, జంగయ్య, కృష్ణయ్య, యాదయ్య, చెంచల, పాముల అరుణ, రాజమణి, జంగమ్మ, అలివేలు, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

మాజీ కౌన్సిలర్ రవినాయక్



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న మాజీ కౌన్సిలర్ రవినాయక్ తదితరులు

తుక్కుగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తుక్కుగూడ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రవినాయక్ సూచించారు. శుక్రవారం పుర కేంద్రంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ పాఠశాలకు చెందిన శివ కరాటేలో ప్రతిభ చూపినందుకు ఇంటర్నేషనల్ బ్లాక్ బెల్ట్‌ను అందజేసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా రవినాయక్ మాట్లాడారు. శివ ఇంటర్నేషనల్ బ్లాక్ బెల్ట్ సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్ రామ్ చారి, కోచ్ గణేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

మహేశ్వరం: నాగారం గ్రామంలోని కుండె వెంకటేష్ ఫామ్ హౌస్‌లో శనివారం ఉదయం 10 గంటలకు బీజేపీ మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు టి యాదిష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సంస్థాగత విషయాలపై, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల గురించి చర్చ, నూతనంగా ఎన్నుకున్న బూత్ అధ్యక్షులకు సన్మానం వంటి అంశాలపై మాట్లాడుతారని తెలిపారు. ఈ సమావేశానికి మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

పుస్తె మెట్టెల అందజేత

కొత్తూరు: నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువకుడి పెళ్లికి శుక్రవారం బంగారు పుస్తె మెట్టెలను మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎమ్మె సత్యనారాయణ అందజేశారు. గ్రామానికి చెందిన దండు రాములు కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా అతడి కుమారుడు శేఖర్ వివాహ నిమిత్తం వధువుకు పుస్తె మెట్టెలను మాజీ సర్పంచ్ అందించారు.

నిఘా నీడలో మహేశ్వరం!

- సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు
- ప్రజా ప్రతినిధులు, దాతల సహకారం అవసరం

మహేశ్వరం: మండలంలో ప్రజల, దుకాణాదారుల సహకారంతో పోలీసులు ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహేశ్వరం, తుమ్మలూరు, సిరిగిరిపురం, మహేశ్వరం గేటు శ్రీశైలం హైవే, మన్సాన్‌పల్లి చౌరస్తా, నాగారం, అమీర్‌పేట్, మాణిక్యమ్మగూడ, కల్వకోల్, కోళ్లపడకల్‌లో ప్రధాన రహదారి వెంట, చౌరస్తాల వద్ద సీసీ కెమెరాలను అమర్చారు. ఆయా గ్రామాల్లోని దుకాణాల్లోనే డీవీఆర్, మానిటర్లను ఏర్పాటు చేశారు. కెమెరాల ద్వారా రికార్డైన వీడియోలు అక్కడ ఏర్పాటు చేసిన డీవీఆర్‌లో నిక్షిప్తం అవుతుంది. ఇంటర్‌నెట్ సౌకర్యం అన్ని గ్రామాల్లో అందుబాటులోకి వస్తే గ్రామాల్లో రికార్డవుతున్న వీడియోలను నేరుగా పోలీస్ స్టేషన్లో చూసుకునే అవకాశం ఉంటుంది. మండలంలో 90 శాతం అన్ని గ్రామాల్లో, తండాల్లో సీసీ కెమెరాలను పోలీసులు దాతల సహకారంతో అమర్చారు. త్వరలో కెమెరాలు అమర్చని గ్రామాల్లో సైతం ఏర్పాటు చేయనున్నారు.

24 గంటలు రికార్డింగ్

సీసీ కెమెరాల ద్వారా గ్రామాల్లో 24 గంటల పాటు నిఘా ఉంటుంది. ఏమైనా దొంగతనాలు, హత్యలు, క్రైం జరిగినప్పుడు పోలీసులు కెమెరాలను చెక్ చేసి నేరాలను ఛేదిస్తున్నారు.

నేరాల నియంత్రణకు దోహదం

సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు ఎంతగానో దోహదపడుతాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో అల్లర్లు జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో పాటు తాగుబోతులు, ఆకతాయిల అగడాలకు కళ్లెం వేయొచ్చని పోలీసులు చెబుతున్నారు. దొంగతనాలు, దోపిడీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నియంత్రించొచ్చని అంటున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం చాలా మంచి పరిణామమని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



మన్సాన్‌పల్లి చౌరస్తాలో ఆటోమెటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు (ఫైల్)

మండలంలో ఏర్పాటు

మహేశ్వరం మండలంలోని 31 గ్రామ పంచాయతీలలో ఆయా గ్రామ ప్రజా ప్రతినిధులు, దాతలు, ప్రజల సహకారంతో సుమారు 3,200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అందులో ఆటోమెటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు 14 అమర్చారు. మహేశ్వరం విప్రో కంపెనీ వద్ద 2, మహేశ్వరం గేటు శ్రీశైలం జాతీయ రహదారి వద్ద 2, రాచులూరు గేటు (శ్రీశైలం జాతీయ రహదారి)2, మన్సాన్‌పల్లి చౌరస్తాలో 4, నాగారంలో 2, కోళ్లపడకల్‌లో 2 పెద్ద కెమెరాలను అమర్చారు. కమ్యూనిటీ కెమెరాలు సుమారు 150, నేను సైతం కెమెరాలు 3వేలు అమర్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, అసాంఘిక కార్యక్రమాలు, ఏదైన నేరాల్లో నిందితులుగా ఉంటే అలాంటి కేసులను పరిష్కరించామని పోలీసులు తెలిపారు.

నేరాలు తగ్గాయి



సీసీ కెమెరాల ఏర్పాటుతో గ్రామాల్లో అల్లర్లు, నేరాలు కొంత వరకు తగ్గాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘీక చర్యలు నియంత్రించారు. నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరిగింది. దొంగలు, దోషులను పట్టుకోవడంతో మార్గం సుగమం అవుతుంది. గ్రామాల్లో కూడా వీటి వినియోగం పెరుగుతున్నాయి. గతంలో దొంగతనాల పరిశోధన కొంత ఇబ్బందికరంగా ఉండేది. ఇప్పుడు సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో చోరీలు తగ్గుముఖం పట్టాయి. సీసీ ఫుటేజీల ద్వారా దోషులను గుర్తించి, గంటల వ్యవధిలోనే పట్టుకోగలుగుతున్నాం. ఇప్పటికే మండలంలోని 90 శాతం గ్రామాలు, తండాల్లో సీసీ కెమెరాలను దాతలు, ప్రజల సహకారంతో అమర్చాం. ఆటోమెటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) కెమెరాలు 14, కమ్యూనిటీ కెమెరాలు 150, నేను సైతం కెమెరాలను సుమారు 3వేల వరకు అమర్చాం. ఆలయాలు, మసీదులు, చర్చిల వద్ద కెమెరాలను ఏర్పాటు చేయించాం. సీసీ కెమెరాలు లేని మిగత గ్రామాలు, తండాల్లో త్వరలో అమర్చుతాం. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయి. సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు ముందుకు రావాలి.

– వెంకటేశ్వర్లు, సీఐ, మహేశ్వరం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కుంట్లూరు, గణేష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 1గంట వరకు, 11కేవీ వాంబేకాలనీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రామకృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. లలితానగర్, గాయత్రినగర్, గాయత్రిహోమ్స్, సీతాహోమ్స్, జిల్లెలగూడ విలేజ్, వెంకటేశ్వర కాలనీ, మిథులానగర్, సత్యసాయి ఎన్‌క్లేవ్, కమలానెహ్రూ నగర్, డీఎస్‌ఆర్‌నగర్, భూపేష్ గుప్తానగర్, శ్రీధర్‌కాలనీ, వివేక్‌నగర్, బండి సత్తయ్యకాలనీ, వీరమణికాలనీ, విజయాహోమ్స్, వెంకటాద్రికాలనీ, వాంబేకాలనీ, మీర్‌పేట విలేజ్, టీఆర్‌ఆర్ టౌన్‌షిప్, ఆదిత్యనగర్, సుమిత్రా ఎన్‌క్లేవ్, జయశ్రీకాలనీ, సర్వోదయనగర్, టీఎస్‌ఆర్‌నగర్, ఓల్డ్, న్యూబాలాజీనగర్, ఆర్ఎన్ రెడ్డినగర్, టీకేఆర్ కళాశాల, లక్ష్మీనగర్, ద్వారకామయికాలనీ, తిరుమలహిల్స్, నందనవనం, రాఘవనగర్, టెలిఫోన్‌కాలనీ, రాఘవేంద్రకాలనీలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బాలగౌడ్ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గ్రహించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులకు సమష్టి కృషి

మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్‌రూరల్: నూతనంగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపాలిటీలో ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా పని చేసి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ సూచించారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో మొదటిసారిగా ఉద్యోగులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహిస్తూ, ఎండా కాలంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే మున్సిపాలిటీ మేనేజర్లుగా ఎస్.కె.జమిల్ అహ్మద్, వెంకటయ్య, ఎంఈపీఎంఏ సెక్షన్ అధికారిగా సంధ్యారాణి, రెవెన్యూ సెక్షన్ సుదర్శన్, టౌన్‌ప్లానింగ్ వెంకటేశ్వర్‌రెడ్డి, శానిటేషన్ అధికారిగా వెంకటేశం శాఖల వారీగా నియమించారు. నిత్యం కేటాయించిన శాఖలను బట్టి అధికారులు తమ పనుల్లో నిమగ్నం కావాలని సూచించారు. అనంతరం కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌ను ఉద్యోగులు, కార్మికులు సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కారోబార్‌లు రాఘవేందర్, శ్రావణ్‌కుమార్, లక్ష్మి, పంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు. అంతకుముందు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో నేతలు కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.



కమిషనర్‌ను సన్మానిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకులు

భూదాన్ భూములకు పట్టాలివ్వాలి

తహసీల్దారుకు బాధితుల వినతి

నందిగామ: నిరుపేదలమైన తమకు అప్పట్లో భూదాన్ బోర్డు ద్వారా కొంత భూమిని ఇచ్చారని, వాటికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని బాధితులు శుక్రవారం తహసీల్దారు రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా భూ బాధితులు మాట్లాడుతూ.. 1975లో భూదాన్ బోర్డు ద్వారా నందిగామలోని సర్వే నంబరు 990లో 18 మంది నిరుపేద దళిత రైతులకు 68 ఎకరాల 22 గుంటల భూమిని దానంగా ఇచ్చారని, ఆ భూమికి సంబంధించి ఓ వ్యక్తి నకిలీ ఓఆర్‌సీ సృష్టించి అయన పేరుపై మార్చుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఓఆర్సీలను రద్దు చేసి తమ పేరుపై పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, చంద్రయ్య, పోచయ్య, రాములు, పోచమ్మ, భీమయ్య, మల్లేష్, చంద్రశేఖర్, జంగయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న భూ బాధితులు

ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు

మొయినాబాద్‌రూరల్: మల్లికార్జున స్వామి నామస్మరణతో అజీజ్‌నగర్ గ్రామం మార్మోగింది. గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జునస్వామి, భ్రమరాంబికా దేవి, గొల్ల కేతమ్మ దేవాలయ పూజలు శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవ సంఘం కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ రాజేందర్‌యాదవ్, కుమార్‌యాదవ్, సిద్దయ్యయాదవ్‌లు కలిసి నూతన దేవాలయంలో విగ్రహాలకు బండారు(పసుపు బొట్టు) ఊరేగింపు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు రక్త పరీక్షలు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల, మధురాపూర్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువుతో పాటుగా హిమోగ్లోబిన్ పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ... విద్యార్థులు తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతంలో మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. తాజా కూరగాయలు, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్‌ఎం హసీనా, ల్యాబ్ టెక్నీషియన్‌లు సదాశివరెడ్డి, స్నేహశ్రీ, ప్రగతి సీనియర్ మేనేజర్ మురళీకృష్ణ, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శంకర్, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ప్రగతి సిబ్బంది జగదీష్, శ్రీకాంత్, కార్తీక్, తులసి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రమాబాయి త్యాగం మరువలేనిది

చేవెళ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ విజయం వెనుక మాతా రమాబాయి త్యాగం ఎంతో ఉందని అంబేడ్కర్ యువజన సంఘం చేవెళ్ల అధ్యక్షుడు సున్నపు ప్రవీణ్, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బేగరి ప్రభాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మాతా రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాతా రమాబాయి తన జీవితాన్ని త్యాగం చేసి అంబేడ్కర్‌కు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. అంబేడ్కర్ ప్రపంచస్థాయి మేధావిగా మారటంలో ఆయన వెనక ఉన్న రమాబాయి త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, యాదగిరి, గణేశ్, సత్తయ్య పాల్గొన్నారు.



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: బీఆర్ఎస్ పాలనలో పల్లెపల్లెకు బీటీ రోడ్లు వేశామని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చెప్పారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన మండలంగా జిల్లేడ్ చౌదరిగూడను ఏర్పాటు చేయడంతోపాటు, 500 జనాభా ఉన్న ప్రతి గ్రామాన్ని, తండాను నూతన పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కేవలం లాల్‌పహాడ్ నుంచి చలివేంద్రంపల్లి వరకు మాత్రమే ఉండేదన్నారు. ఇప్పుడు ప్రతి గ్రామానికి బీటీరోడ్డు ఏర్పాటు చేశామని, అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు వేశామన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ, శాంతులతో జీవనం సాగించారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బీఆర్ఎస్ హయాంలో మండలాన్ని అభివృద్ధి చేయలేదని అనడం బాధాకరమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు సయ్యద్ హఫీజ్, శ్రీధర్ రెడ్డి, నాయకులు జబ్బార్, నర్సింగ్ రావు, బాబురావు, సత్యప్రమోద్ రావు, అజ్మీర్, సలీం, పాండుయాదవ్, రామచంద్రయ్య, శేఖర్, అమీర్, మురళి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



షాద్‌నగర్‌రూరల్: రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టిన సందర్భంగా సంబురాలు

షాద్‌నగర్‌రూరల్/కొత్తూరు/కొందుర్గు: పల్లెల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేపట్టిన సందర్భంగా శుక్రవారం షాద్‌నగర్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత ఫరూఖ్‌నగర్ మండల నాగులపల్లి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ హాజరై గ్రామ ముఖ్య కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ నుంచి నాగులపల్లి మీదుగా ఈదులపల్లికి రూ.1.70 కోట్లతో బీటీ రోడ్డు, నాగులపల్లి నుంచి రాసుమల్లగూడ వరకు రూ.60 లక్షలతో బీటీ రోడ్డు, హరిజనవాడలో రూ.7లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఆమోదం తెలపడం రాష్ట్ర చరిత్రలోనే మర్చిపోలేనిదన్నారు. ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై సీఎం రేవంత్‌రెడ్డితో పాటుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించారన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో నిర్వహించిన సంబరాల్లో ఎమ్మెల్యే శంకర్ పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొందుర్గు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు డప్పులతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ
- అదనపు తరగతుల నిర్వహణ

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఫలితం సాధించడమే లక్ష్యంగా జిల్లా ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు దృష్టి సారించారు.

వెనుకబడిన వారిపై దృష్టి

షాబాద్ మండల పరిధిలోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 480 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి క్లిష్టమైన పాఠ్యాంశాలను అర్థమయ్యేలా తిరిగి బోధిస్తున్నారు. చాలా పాఠశాల్లో ఇప్పటికే సిలబస్ పూర్తి చేశారు. దీంతో ప్రత్యేక పరీక్షలను నిర్వహించి, విద్యార్థుల్లో ఉన్న భయందోళనను పోగొడుతున్నారు. ఆయా పాఠ్యాంశాలపై వారాంతంలో విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు.


ప్రశ్నలు రూపొందించి

ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనే ఉపాధ్యాయులు ప్రతి సబ్జెక్టుకు సంబంధించి ప్రత్యేకంగా ప్రశ్నలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు చేపడుతున్నారు. తరగతుల సమయంలో విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం సైతం అందిస్తున్నారు. గతంలో జరిగిన తప్పిదాలను దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ అధికారులు గత సెప్టెంబర్ చివరి వారం నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం సాయంత్రం 4:15 గంటల నుంచి 5:15 వరకు నిర్వహిస్తున్నారు. రోజు సబ్జెక్టుకు సంబంధించి పాఠ్యాంశాలపై పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు.



తాళ్లపల్లి జెడ్పీ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు


సందేహాల నివృత్తి



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు రోజుకు రెండున్నర గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్ట్‌ల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే అల్పాహారం కూడా అందిస్తున్నారు. నిత్యం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

– శ్రీ నికిత, పదోతరగతి, తాళ్లపల్లి ఉన్నత పాఠశాల

పరీక్షల నిర్వహణ



సబ్జెక్ట్ వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు పరీక్షలు నిర్వహించి మార్కులు తెలియజేస్తున్నారు. మార్కులు తక్కువగా వచ్చిన విద్యార్థులు సబ్జెక్ట్ వారీగా సామర్థ్యాలను పెంపొందించుకొని మెరుగైన మార్కులు తెచ్చుకోవడానికి ఉపయోగపడుతుంది.

–మణికంఠ, పదో తరగతి, తాళ్లపల్లిఉన్నత పాఠశాల

లక్ష్యాన్ని నిర్దేశించాం



పాఠశాలలో లక్ష్యాన్ని నిర్ణయించాం. శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించాం. అందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. రివిజన్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు.

– విష్ణువర్ధన్‌రెడ్డి, జీహెచ్‌ఎం, తాళ్లపల్లి